# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 03-10-2024          సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

❖ ప్రభుత్వంలోని ప్రతీ విభాగంలో 15 శాతం వృద్ధి రేట్ లక్ష్యంగా పని చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు.

❖ దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దర్శనాలు కల్పిస్తామని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు.

❖ బీసీ కుల వృత్తుల్లో నైపుణ్యం పెంచి జీవనోపాధి పెంపొందించేలా ఆర్థిక చేయూత అందిస్తామని మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు.

❖ కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని  కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

❖ "ప్రధానమంత్రి జన్ జాతీయ ఉన్నతి గ్రామ అభియాన్" పథకాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ అన్నారు.

================================

వ్యవసాయ అనుబంధ రంగాలు, పారిశ్రామిక రంగం, సేవల రంగంలో వృద్ధిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు సచివాయలంలో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో నూతన పాలసీలతో అన్ని రంగాలను ప్రక్షాళణ చేసి ఆర్థిక వృద్ధి సాధించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అన్నారు. 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంతో ప్రభుత్వం పని చేయాలని అధికారులకు సూచించారు.  ప్రతీ శాఖలో నూతన పాలసీలు తీసుకువస్తున్నామని.. వీటిని సమర్థవంతంగా అమలు చేసి ఆర్థిక పురోగతి సాధించాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడంతో పాటు.. వారిపై అదనపు భారం లేకుండా ప్రభుత్వ ఆదాయం పెంచే విధానాలను అమలు చేయాలన్నారు. వ్యవసాయం రంగంలో సమగ్ర యాంత్రీకరణ ద్వారా సాగు ఖర్చులు తగ్గించవచ్చని ముఖ్యమంత్రి తెలిపారు.

================================

దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా తొలిరోజున శ్రీబాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో కొలువై ఉన్న విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారిని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఈరోజు దర్శించుకున్నారు. దేవీ శరన్నవరాత్రులలో తొమ్మిది రోజుల పాటు వివిధ అలంకరణలలో దర్శనమివ్వనున్న అమ్మవారిని మొదటి రోజున దర్శించుకోవడం మహా భాగ్యమని మంత్రి పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా, దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దర్శనాలు కల్పిస్తామని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఈ రోజు మంత్రి కొలుసు పార్ధసారథితో కలిసి కనకదుర్గమ్మ వారి కోసం ప్రత్యేకంగా రూపొందించిన పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేవి నవరాత్రులు ఘనంగా నిర్వహించడానికి అన్ని విభాగాలు కలిసి పని చేస్తున్నాయని రామనారాయణరెడ్డి తెలియజేస్తూ....

(వాయిస్ 34 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఆంధ్రప్రదేశ్ లో సీడ్ పథకం అమలు చేస్తున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. విజయవాడలో బీసీ సంక్షేమ శాఖలో కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలుపై నిర్వహించిన కార్యశాలలో ఈరోజు మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇప్పటికే 6 జిల్లాలో సీడ్ పథకం అమల్లో ఉందని, త్వరలో మిగిలిన 20 జిల్లాలో అమలు చేయనున్నామని తెలిపారు. సీడ్ పథకం కింద బీసీ - ఏలో ఉన్న సంచార జాతుల జీవన ప్రమాణాలు పెంచేలా నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. బీసీ కుల వృత్తుల్లో నైపుణ్యం పెంచి జీవనోపాధి పెంపొందించేలా ఆర్థిక చేయూత అందిస్తామని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గత సంవత్సరాలుగా వెనుకబడి ఉన్న అనేక కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు రైల్వే స్టేషన్, రైల్వే యార్డుల్లో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ఈ రోజు గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ ఎమ్.రామకృష్ణతో కలిసి పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, గుంటూరు రైల్వే స్టేషన్ కు 150 కోట్ల రూపాయలతో మంజూరైన మల్టీ ట్రాకింగ్ కనెక్టివిటీ పనులను మార్చి 2026 లోగా పూర్తి చేయనున్నామని కేంద్రమంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 23 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

"ప్రధానమంత్రి జన్‌జాతీయ ఉన్నతి గ్రామ్ అభియాన్" పథకాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమం అమలుకు శాఖల వారీగా కావలసిన ప్రతిపాదనలపై కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రధానమంత్రి జనజాతీయ ఉన్నతి గ్రామ అభియాన్ కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామానికి రోడ్డు సదుపాయంతోపాటు, ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి, విద్యుత్ సౌకర్యాలు మొదటి ప్రాధాన్యంగా ప్రతిపాదనలు తయారు చేయాలని తెలిపారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు రేపటి నుండి 9 రోజుల పాటు జరుగనున్నాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా సర్వాంగ సుందరంగా తిరుమల క్షేత్రాన్ని అలంకరించారు. బ్రహ్మోత్సవాలకు తిరుమల తిరుపతి దేవస్థానం

ఈరోజు రాత్రి  7 గంటలకు అంకురార్పణ చేయనుంది. రేపు సాయంత్రం 5 గంటల 45 నిమిషాలకు శుభలగ్నంలో ధ్వజారోహణంను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. రేపు రాత్రి 7 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దిగువ ట్రోపో ఆవరణంలో పశ్చిమ, వాయువ్య  దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ప్రభావంతో రాబోయే మూడు  రోజుల పాటు రాష్ట్రంలోని ఉత్తర కోస్తా జిల్లాలలో తేలికపాటి నుండి ఒక  మోస్తరు వర్షాలు  లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి  లేదా  రెండు  చోట్ల  కురిసే అవకాశముందని తెలిపింది. దక్షిణ కోస్తా, రాయలసీమ  జిల్లాలలో అక్కడక్కడ ఊరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని వాతావరణశాఖ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీ దేవిశరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభంకావడంతో విశాఖలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఉత్తరాంధ్ర ఇలదైవం శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంతో సహా పలుదేవాలయాల్లో ప్రత్యేక అలంకరణల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తున్నారు. మరిన్ని వివరాలు  విశాఖపట్నం ఆకాశవాణి ప్రతినిధి వీ.ఎస్.ఎన్.మూర్తి తెలియజేస్తూ…

(వాయిస్ 33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడమే రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 3 రోజులపాటు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ శిక్షణలో భాగంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక ప్రజాప్రతినిధులకు ఆయా అంశాలపై పూర్తిస్థాయి శిక్షణ ఇవ్వనున్నామని కృష్ణమోహన్ చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 7వ తేదీన ఢిల్లీ వెళ్లనున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు పలువురు కేంద్రమంత్రులతో ఆయన సమావేశం కానున్నారని అధికారవర్గాలు వెల్లడించాయి. అలాగే రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమైన రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ముఖ్యమంత్రి చర్చించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కృష్ణా జిల్లాలో క్రీడల అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. ఈరోజు జిల్లా స్థాయి క్రీడల అభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ… గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీల ద్వారా 3 శాతం క్రీడల సుంకం వసూళ్లపై వివరాలను  అధికారులను అడిగి తెలుసుకున్నారు. జీవో నెంబర్ 84 ప్రకారం పన్ను వసూలు చేయడం ద్వారా జిల్లా స్పోర్ట్స్ అథారిటీలు ఆర్థికంగా బలోపేతం చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కోస్తా తీర ప్రాంతంలో స్విమ్మింగ్ లో చిన్నారులకు సరైన శిక్షణ అందించి, పోటీలకు సిద్ధం చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విజయనగరం జిల్లాలో పత్తి రైతుల జాబితాను సిద్ధం చేసి, కొనుగోలు ప్రకిక్రియకు ఏర్పాట్లు పూర్తిచేయాలని విజయనగరం సంయుక్త కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ అధికారులను ఆదేశించారు. పత్తి కొనుగోలు ప్రక్రియను ప్రారంభించేందుకు ఈరోజు

సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలో  నవంబరు 2వ వారం నుంచి పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని తెలిపారు. రాజాం, రామభద్రాపురంల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ఆయన వెల్లడించారు.

================================
================================